www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 24 సెప్టెంబర్ 2023
5
అన్నమయ్య

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

ప్రజాశక్తి-రాయచోటి

నియోజకవర్గంలో వైసిపి, టిడిపి మధ్య జరుగుతున్న కక్ష రాజకీయాలు వదిలి పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాహుల్ గాంధీ తెలంగాణలో విజయభేరీ సభలో కాంగ్రెస్ ఆరు పథకాలు గ్యారెంటీ ప్రకటించి తెలంగాణ అభివృద్ధికి ఈ పథకాలు దోహదపడేలా ఉన్నాయని, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని నియోజకవర్గంలోని యువత స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్లాబకాష్ సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ ప్రెసిడెంట్ రాయచోటి చెన్నకృష్ణ, నూరుల్లా, హబీబ్ సారధ్యంలో బాబ్జి, ఇస్మాయిల్, ఖలీల్, షేక్ బాబ్జి, మున్నా చేరారు.

యువతను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న అల్లాబకాష్

సామాజిక న్యాయం కోసం 29న మహాధర్నా

- వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ పిలుపు

ప్రజాశక్తి-కడప అర్బన్

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని పటిష్టంగా అమలు, జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు అమలు, అసైన్డ్ చట్ట సవరణ ఉపసంహరించు కోవాలని ఈ నెల 29న విజయవాడలో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం అంబేద్కర్ భవన్‌లో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో పరిపాలన అధ్వాన్నంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని విమర్శించారు. అనేక సంవత్సరాలుగా దళితులు సామాజికన్యాయం కోసం రోడ్డెక్కుతున్న వారికి న్యాయం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో దాదాపు 45 సంఘాలు కలిసికట్టుగా ఏర్పడి దళితుల అభ్యున్నతి కోసం పనిచేస్తున్నాయని తెలిపారు. దళిత గిరిజనులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్‌ను 300 యూనిట్లకు పెంచాలని పేర్కొన్నారు. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని కోరారు. డప్పుచర్మకారుల పెన్షన్ రూ.5 వేలకు పెంచాలని పేర్కొన్నారు. శ్మశానంలో పనిచేస్తున్న కార్మికులను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడాలని తెలిపారు. ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం చేకూరుతుందని వైసిపి, టిడిపి చెప్పుకుంటున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం సామాజిక న్యాయానికి పాత్ర వేసిందని అనడానికి మణిపూర్ ఘటనే నిదర్శనమని పేర్కొన్నారు. బయటి ప్రపంచానికి తెలియకుండా అనిచి పెట్టిందని తెలిపారు. మణిపూర్ ఘటనపై స్పందించని ప్రధానమంత్రి నరేంద్రమోడీ సనాతన ధర్మంపై తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలకు వెంటనే స్పందించారని పేర్కొన్నారు. మణిపూర్ ఘటనపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. దళిత చట్టాలను నీరు కారుస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో బిజెపికి సంపూర్ణ బలం చేకూరుతుందని పేర్కొన్నారు. దీనికి కారణం వైసిపి, టిడిపి, జనసేన కేంద్రంలోని బిజెపిపై ఎలాంటి వ్యాఖ్యలు చేయకపోవడమేనన్నారు. బిజెపి తిరిగి అధికారంలోకి వస్తే సావర్కర్ జయంతి రోజును మనువాద సిద్ధాంతాన్ని అమలు చేయడానికి సన్నద్ధమవుతుందని హెచ్చరించారు. కొత్త పార్లమెంటు భవనం ప్రారంభానికి రాష్ట్రపతిని పిలవకపోవడం వివక్షతన్నారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని కోరారు. దళితుల చేతిలో భూమిలేదని, పెత్తందార్లు ఆక్రమించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అసైన్డ్ చట్టాన్ని సవరించి భూస్వాములకు మేలు చేస్తుందని విమర్శించారు. హక్కుల సాధన కోసం నిర్వహించే పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డి.సి.వెంకటయ్య, రామయ్య, చిన్నబి, నారాయణ, శ్రీకాంత్, చంద్ర, నక్క నారాయణ పాల్గొన్నారు.

వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కెవిపిఎస్, వ్య.కా.స నాయకులు

ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకుందాం

- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకుందామని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు అన్నారు. యుటిఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం నుంచి విజయవాడ వరకు నిర్వహిస్తున్న ప్రచారయాత్ర శనివారం రాయచోటికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక జూనియర్ కళాశాల వద్ద యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యా రంగాన్ని కాపాడుకుందాం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించుకుందాం అన్న నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా రెండు టీంల ఆధ్వర్యంలో జాతా కొనసాగుతుందన్నారు. అక్టోబరు ఒకటో తేదీన విజయవాడలో సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో జరుగు స్వర్ణోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని కోరారు. ప్రజా సంకల్ప యాత్రలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఉపాధ్యాయులకు ఇచ్చిన మాట తప్పారన్నారు. జిపిఎస్ రద్దుచేసి ఓపిఎస్ అమలు చేస్తామని హామీ ఇచ్చి నేడు మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓపిఎస్ సాధనకు ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. అధ్యయన, అధ్యాపనం, సామాజిక స్పృహ ప్రధాన సూత్రాలతో యుటిఎఫ్ ఆవిర్భవించి ఈ దశలో ప్రయాణిస్తూ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం అనేక ఉద్యమాలు చేసి ప్రొబెషనల్ బెనిఫిట్స్ స్కీం, రీ గ్రూపింగ్ స్కేల్, ఉపాధ్యాయుల బదిలీల కౌన్సిలింగ్ విధానం, అప్రెంటిస్ విధానం రద్దు వంటి వాటిని సాధించామని చెప్పారు. ఉద్యోగులకు ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే 2024 ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేష్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఉద్యోగుల విరమణ అనంతరం వారి భవిష్యత్తు కోసం పాత పెన్షన్ పథకం తప్పా ఏది ప్రత్యామ్నాయం కాదని ఓపిఎస్ సాధన కోసం కలిసి వచ్చే అన్ని సంఘాలతో రాజీ లేని పోరాటాలు చేస్తామని అయన అన్నారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని బలహీన పరిచే జాతీయ నూతన విద్యా విధానాన్ని పునఃపరిశీలన చేసి మేధావులు, విద్యా వేత్తలతో చర్చించి కామన్ స్కూల్ విధానాన్ని తీసుకుని రావాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయులను చదువు చెప్ప నీయకుండ రకరకాలైన పనులను పురమాయిస్తోందని అన్నారు. రాష్ట్ర సిలబస్ అని, సెంట్రల్ సిలబస్ అని ఇప్పు డేమో ఐబి సిలబస్ అనే చర్చకు తెర లేపారని అయన విమ ర్శించారు. స్టేట్ సిలబస్ చదివిన విద్యార్థులు అన్ని పోటీ పరీక్షల్లో ధీటుగా రాణిస్తున్నారని, అటువంటప్పుడు కొత్త కొత్త ప్రయోగాలు చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఒపిఎస్ సాధించేంతవరకు కలిసికట్టుగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబిర్, జిల్లా కార్యదర్శులు గంగాదేవి, రమణయ్య, శ్రీధర్‌రెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్రరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చెంగల్వరాజు, సీనియర్ నాయకులు మృత్యుంజయ రాజు వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీలేరు: యుటిఎఫ్ స్వర్ణోత్సవ బైక్ జాతా పీలేరుకు చేరుకుంది. ప్రచార జాతకు పీలేరు డివిజన్ తరపున పట్టణ శివారులోని వెంకటేశ్వర స్వామి దేవస్థానం ముందు స్వాగతం పలికారు. అక్కడి నుంచి పీలేరు క్రాస్ రోడ్డుకు 100 స్కూటర్లతో ర్యాలీ నిర్వహించి, క్రాస్ రోడ్‌లో యుటిఎఫ్ జెండాను పీలేరు డివిజన్ సీనియర్ నాయకులు రాధాకృష్ణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు ప్రసంగించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ సహాధ్యక్షులు శివారెడ్డి, కోశాధికారి, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు సదాశివరెడ్డి, కెవి.పల్లి నాయకులు వెంకటరమణ, రమేష్‌రెడ్డి, జంగారెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రాయచోటి : పట్టణంలో నిర్వహిస్తున్న యుటిఎఫ్ బైక్ జాతా

పీలేరు : జెండా ఆవిష్కరణ సభలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించాలి : కలెక్టర్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఆర్‌డిఒలు, సిడిపిఒలు, మండల స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ సెక్ర టరీలు, గ్రామ వార్డు స్థాయి అధికారులతో బాల్యవివాహాల నిర్మూలనపైనా, ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 31, 39ల అమలుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని బాల్యవివాహాలు జరిగితే ఎఫ్ఐఆర్ నమోదు చేసి కఠినంగా శిక్షించాలని అన్నారు. జిల్లాలో బాల్యవివాహాలు జరిగే హాట్ స్పాట్ ప్రాంతాలను గుర్తించాలని, గోడల మీద ప్రజలకు అర్థమయ్యే విధంగా పెయింటింగులను ఏర్పాటు చేసి బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాల గురించి అవగాహన కల్పించాలని సూచిం చారు. వివాహ కార్యక్రమాలను నిర్వహించే పురోహితులకు, పాస్టర్లకు, ముల్లాలకు, కల్యాణ మండప నిర్వాహకులకు, తదితరులకు బాల్య వివాహాలు జరగకుండా ఉండేందుకు అవగాహన కల్పించాలని సూచిం చారు. డివిజనల్, మండల స్థాయి అధికారులు ప్రతి మూడు నెలలకు ఒకసారి బాల్యవివాహాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించాలని ఆదేశిం చారు. 15 నుంచి 18 సంవత్సరాల వయసు గల ఆడపిల్లలు, అబ్బా యిలను పాఠశాల లేదా కళాశాలలో చేర్పించే విధంగా చర్యలు తీసు కోవాలని మండల స్థాయిలో ఎంఇఒలకు, సిఆర్‌పిలకు సచివాలయ స్థాయిలో ఎడ్యుకేషన్ సెక్రటరీలకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. పాఠశాల లేదా కళాశాల బయట కౌమార దశలో ఉన్న అమ్మాయిలకు జిల్లాలోని స్వయం సహాయక సంఘాలు, ఎన్‌జిఒల సాయంతో వారికి ఆసక్తి ఉన్న రంగంలో నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను అమలు చేయాలని కోరారు. పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, వెల్ఫేర్ హాస్టళ్లు, తదితర వాటిలలో బాల్య వివాహాలు, బాలలకు ఉన్న హక్కులు, వారి సాయం కోసం ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ నెంబర్లపై తెలియజేయాలన్నారు. 18 సంవత్సరాల లోపు బాలికలకు ,21 సంవత్సరాలు లోపు అబ్బాయిలకు వివాహం చేస్తే పెళ్లి కుమారునికి వారి తల్లిదండ్రులకు పెళ్ళిలో పాల్గొన్నవారికి జైలు శిక్ష, జరిమానా విధిస్తామనే ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని సంబంధితఅధికారులకు సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఐసిడిఎస్ జిల్లా అధికారి ధనలక్ష్మి, ఆర్డీవోలు, సిడిపిఒలు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

క్రిమినల్ ప్రభుత్వాన్ని గద్దె దించుదాం

- టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా

ప్రజాశక్తి- రాయచోటి

రాష్ట్రంలో రాజ్యాంగాన్ని సమాధి చేస్తున్న వైసిపి క్రిమినల్ ప్రభుత్వాన్ని వెంటనే గద్దె దింపాలని గాజుల ఖాదర్‌బాష పేర్కొన్నారు. టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడుపై వైసీపీ ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసును వెంటనే ఎత్తి వేయాలంటూ నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి రమేష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని టిడిపి కార్యాలయంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 10వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఖాదర్ బాషా మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో రాష్ట్ర ప్రజలకు ఉరి వేసుకునే పరిస్థితులు దాపురించాయన్నారు. రాష్ట్రంలో ఏ వర్గానికి చెందిన ప్రజలు గానీ ,రైతులు శ్రామికులు గానీ సంతోషంగా లేరని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వర్గాలతో పాటు మహిళలకు రక్షణ లేకుండా పోయిందని తెలిపారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. ముఖ్యమంత్రి జగన్ రెడ్డి నియంతృత్వ పాలనతో విసిగిపోయిన రాష్ట్ర ప్రజలు సైకో పాలనకు చరమగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. దీక్షల్లో టిడిపి పట్టణ అధ్యక్షులు బోనమల ఖాదరవల్లి, మాజీ జడ్‌పిటిసి మల్లు నర్సారెడ్డి, మాజీ ఎంపిపి ఉమాపతి రెడ్డి,మండల మాజీ ఉపాధ్యక్షులు అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి, సంబేపల్లి మండల టిడిపి అధ్యక్షులు చిన్న రెడ్డయ్య యాదవ్, పార్థసారధి రెడ్డి సర్పంచులు మహబూబ్ అలీ,వీర రాఘవులు, నీటి సంఘం నాయకులు ప్రభాకర్ రెడ్డి,టిడిపి ప్రధాన కార్యదర్శి రవికుమార్, వెంకటరమణారెడ్డి,టిడిపి నాయకులు రఫీ,శివప్ప నాయుడు, రెడ్డిప్రసాద్ రెడ్డి, చిన్నపరెడ్డి,రెడ్డప్పరెడ్డితో పాటు నియోజవర్గంలోని అన్ని మండలాలకు చెందిన రైతులు పాల్గొన్నారు. దీక్షకు జనసేన పార్టీ నాయకులు సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

3లోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

ప్రజాశక్తి-పీలేరు

2024 మార్చిలో జరగబోవు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు అక్టోబరు 3వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించుకోవాలని పీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వై.వెంకటరెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో గత విద్యా సంవత్సరాల్లో ఇంటర్ చదివి ఫెయిల్ అయిన విద్యార్థులు కూడా పరీక్ష ఫీజు చెల్లించుకోవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం విద్యార్థులు కళాశాలకు వచ్చి తమ సిబ్బందిని సంప్రదించాలని తెలియజేశారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్య అతిథులు

‘ఆదిత్య’లో జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో సిఎస్ఇ, ఎఐడిఎస్ ఇంజినీరింగ్ విభాగాల ఆధ్వర్యంలో అనూఖా 2కె 23ఎ నేషనల్ లెవెల్ టెక్ ఫెస్ట్ జరిగినది. ఈ కార్యక్రమంలో వివిధ ఇంజనీరింగ్ కళాశాల నుంచి వచ్చిన విద్యార్థులు మరియు ఆదిత్య కళాశాల విద్యార్థులు పాల్గొని వివిధ టెక్నికల్ మరియు నాన్ టెక్నికల్ ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ మూలి హరీష్, టెస్ట్ అనాలసిస్ట్, ఇన్ఫోసిస్ బెంగళూరు వారు మాట్లా డుతూ టెక్నాలజీ గురించి దాని ప్రాధాన్యత గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే సతీష్ బాబు విద్యార్థులను అభినందిస్తూ ప్రస్తుత విద్యా విధానంలో కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సైన్స్ వలన కలిగే ఉపయోగాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్. ఎం.డి.షఫీ హెడ్ ఆఫ్ ఎఐడిఎస్, డాక్టర్.జె.జగన్ హెడ్ ఆఫ్ సిఎస్ఇ హెచ్ఒడిలు, వివిధ కళాశాలల నుంచి వచ్చిన అధ్యాపకులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కార్యకర్తలకు అన్నివిధాల అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మండలంలోని వేంపల్లి పంచాయతీ హరిజనవాడకు చెందిన టిడిపి కార్యకర్తలు నరసింహులు, నల్లప్పలు వైసిపి నాయకులు దాడిలో గాయపడి మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న షాజహాన్ బాషా శనివారం ఆసుపత్రికి వెళ్లి వారిని పరామర్శించారు. అనంతరం పోలీసులతో మాట్లాడి దాడి చేసిన వారిని అరెస్టు చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా షాజహాన్‌బాషా మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలను అధికార వైసిపి నాయకులు తీవ్ర ఇబ్బందులు గురిచేస్తున్నారన్నారు. దాడులు చేయడం, అక్రమ కేసులు బనాయించడం బాధాకరమన్నారు. నియోజ కవర్గంలోని టిడిపి కార్యకర్తలు, నాయకులకు నిరంతరం అందుబాటులో ఉండి వారి శ్రేయస్సుకు కృషి చేస్తానని వెల్లడించారు.

బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

నేడు నెల నెలా సీమ సాహిత్యం

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న ‘నెల నెలా సీమ సాహిత్యం’ కార్యక్రమంలో భాగంగా 124వ సదస్సును ఈనెల 24 నిర్వహిస్తున్నట్లు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ 124వ సదస్సులో ‘కడప జిల్లా కైఫియత్తులు–సామాజిక అంశాలు’ అనే అంశంపై తెలుగు అధ్యాపకులు డాక్టర్ ఎం.లక్ష్మయ్య ప్రసంగిస్తారని తెలిపారు. ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

రాజకీయంగా ఎదుర్కోలేకనే అక్రమ కేసులు :‘మండిపల్లి’

ప్రజాశక్తి- రాయచోటి

మాట్లాడుతున్న రాంప్రసాద్‌రెడ్డి

తనను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేకనే కొందరు వైసిపి నాయకులు కలిసి పుంగనూరు, అంగళ్లలో జరిగిన ఘటనలో హత్యాయత్నం కింద అక్రమ కేసు బనాయిం చారంటూ టిడిపి నియోజకవర్గ నాయకులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆరోపిం చారు. ఆ కేసుల్లో హైకోర్టులో బెయిల్ రావడంతో శనివారం ఆయనను సంబేపల్లె మండలం గుట్టపల్లె వద్ద టిడిపి నాయకులు, కార్యకర్తలు, మండిపల్లి అభిమానులు కలిసి గజమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి కాన్వాయ్‌లో రాయచోటి పట్టణానికి చేరుకున్నారు. రాంప్రసాద్‌రెడ్డిని బుజాలపై ఎత్తుకొని పూల వర్షం కురిపిస్తూ ర్యాలీగా ఎస్‌ఎన్ కాలనీ వద్దకు తీసుకొచ్చారు. అనంతరం రాంప్రసాద్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ పుంగనూరు, అంగళ్లులో జరిగిన సంఘటనలకు తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తమ అధినేత చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో మద్దతు తెలిపేందుకు పుంగనూరుకు వెళ్ళామే తప్పా దాడులు చేయలేదన్నారు. దాడులు చేసిన వైసిపి వారిని వదిలేసి పోలీసులు అనవసరంగా టిడిపి కార్యకర్తలపై లాఠీఛార్జి చేసి చావబాదారన్నారు. పోలీసుల పై దాడులు చేసే సంస్కృతి తమది కాదన్నారు. తమ నాయకుడు వస్తే అక్కడికి తాము వెళ్లడం తప్పా అని ఆయన ప్రశ్నించారు. కొంతమంది వైసిపి నాయకులు పోలీసు వ్యవస్థ పై ఒత్తిడి తీసుకొచ్చి తనతోపాటు టిడిపి నాయకులపై అక్రమ కేసులు బనాయించారంటూ ఆరోపించారు. నియోజకవర్గంలో ప్రజల నుండి తనకు వస్తున్న ప్రజా ఆదరణ చూసి ఓర్వలేక స్థానిక ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే పోలీసులు తన పై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి తనను తన కుటుంబానికి, కార్యకర్తలకు 48 రోజులు దూరం చేశారంటూ ఆరోపించారు. శ్రీకాంత్‌రెడ్డి ఏ పార్టీలో ఉన్నారో తన తండ్రి హయాం నుంచి అదే పార్టీలో 30 ఏళ్ల పాటు పనిచేశామని గుర్తు చేశారు. మరో ఆరు నెలల్లో ప్రజలు ఓటుతో మీకు సమాధానం చెబుతారని హెచ్చరించారు. ప్రాణం ఉన్నత వరకు ప్రజల కోసం ముందుండి పోరాడతాన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోరు షురూ

ఉపాధ్యాయ ఉద్యమం ఉధృతరూపం దాల్చనుంది. జిల్లా వ్యాప్తంగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిపిఎస్ వద్దు.. ఒపిఎస్ అమలు చేయాలని కోరుతూ ఉపాధ్యాయలోకం నినదిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రతిపక్ష నాయకుని హోదాలో పాదయాత్ర చేస్తున్న సందర్భంగా వైసిపి అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే ఒపిఎస్ స్కీమ్‌ను అమలు చేస్తామని ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని కోరుతూ ఉపా ధ్యాయలు నాలుగున్నరేళ్లుగా ఉద్యమి స్తున్నారు. మాట తప్పను.. మడమ తప్పను అనే ప్రచారంతో ప్రజల్ని నమ్మించి అధికారంలోకి వచ్చిన అంశాన్ని ఉపాధ్యాయులు గుర్తుచే స్తున్నారు. అడగని జిపిఎస్‌ను అమలు చేయాలని ఒత్తిడి చేస్తుండడంపై అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో సిపిఎస్‌ను అమలు చేస్తామని ఇచ్చిన హామీని నమ్మి ఓట్లు వేయడంతో రికార్డు మెజార్టీతో అధికారంలోకి వచ్చిన సంగతిని గుర్తు చేస్తోంది. 2024 స్వార్వత్రిక ఎన్నికల్లో సిపిఎస్ హామీని అమలు చేయాలని కోరుతూ చేపట్టిన ఉద్యమం ఎన్నికల అజెండాగా మార్చడంలో సఫలమైన ఉపాధాయయ సంఘాలు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంది. ఉమ్మడి కడప జిల్లాలో సుమారు 12 వేల మందికిపైగా ఉపాధ్యాయులు ఉన్నారు. గతేడాది నిర్వహించిన చలో విజయవాడ జయప్రదమైన సంగతి తెలిసిందే. ఇటువంటి ఉద్యమ స్ఫూర్తిని ఉపాధ్యాయ శ్రేణుల్లో రగిలించాల్సిన బాధ్యత ఉపాధ్యాయ సంఘాలపై ఉంది. జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాలన్నీ ఐకమత్యంతో ఉద్యోగుల హక్కుల్ని పోరాడి సాధించుకోవాలి. ఇటువంటి తరహాలోనే కార్మిక, కర్షకుల హక్కుల పోరాట సమయాల్లో శ్రమశక్తులు సంఘీభావాన్ని ప్రకటిస్తూ కార్మిక, కర్షక, హక్కులను సాధించుకోవడానికి దోహదం చేయాలి. శ్రమశక్తులన్నీ సంఘటితమైతేనే పాలక వర్గాలు దిగివచ్చి వాస్తవంలో జీవించే అవకాశం ఉంది. లేనిపక్షంలో కార్మిక, కర్షక, ఉద్యోగుల శ్రమను దోచుకుని ఆశాశ హర్మ్యాల్లో విహరిస్తూనే ఉంటారు. మోసపోయిన వాళ్లు మోసపోతూనే ఉంటారు. లబ్ధి పొందే పరాన్న బుక్కులు శ్రమటోర్చ కుండానే బోక్తలుగా మారి సోమరులుగా తయారవుతూనే ఉంటారు. పోరాటాల ద్వారానే కార్మిక, కర్షక, ఉద్యోగుల హక్కులు సాధించ బడతాయనేది చరిత్ర రుజువు చేసిన సత్యం. శ్రమశక్తుల్లో ముఖ్యంగా ఉద్యోగుల్లో చైతన్యం పాలు అధికం. ఇటువంటి ఉద్యోగ సంఘాలన్నీ ఏకమై తమ హక్కులను సాధించుకునే అంశంలో ఉమ్మడిగా పోరాడాల్సిన ఆవశ్యతను గుర్తెరిగి మసలుకోవాలి. మానవజాతి వికాస పరిణామాల్ని పరిశీలిస్తే చరిత్ర నిండా పోరాటాలు, సంఘర్షణలే ఉన్నాయని తెలుస్తోంది. వీటి ఆధారంగానే మానవజాతి వికాసం, సామాజిక, సాంస్కృతిక పురోగతి సాధించిన ఘట్టాలు సాక్ష్యాలుగా నిలిచిన సంగతిని గమనంలో ఉంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- ప్రజాశక్తి-కడప ప్రతినిధి

శోభాయమానంగా ‘ఆజాదీకా’ కలశ యాత్ర

కలశ యాత్రలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

ప్రజాశక్తి–వాల్మీకిపురం

ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమం సందర్భంగా కలశ యాత్ర కార్యక్రమాన్ని వాల్మీకిపురం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం శోభాయామానంగా నిర్వహించారు. కలికిరి ఐటిబిపిఎఫ్ 53వ బెటాలిన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని పంచాయతీల నుంచి సేకరించిన మట్టి, ధాన్యాలను కలశంలో కలిపి పండుగ వాతావరణంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. వాల్మీకిపురంలోని మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల, జిఎంసి బాలయోగి గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత, పివిసి హైస్కూలు, జూనియర్ కళాశాల, ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆలపించిన దేశభక్తి గేయాలు, నృత్యాలు అబ్బురపరిచాయి. ఎంపిడిఒ షబ్బీర్ అహ్మద్ ‘ఆజాదీకా అమృత్ మహోత్సవ్’ ప్రతిజ్ఞ చేయించారు. గురుకుల పాఠశాల విద్యార్థులు డ్రమ్స్ తో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు , కవాతు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు జెండాలు పట్టుకొని దేశభక్తిని చాటుతూ చేసిన నినాదాలు హోరెత్తించాయి. కార్యక్రమంలో ఐటిబిపిఎఫ్ కమాండెంట్ అమిత్ భాటి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, ఆర్‌బికె చైర్మన్ నీళ్ల భాస్కర, వైస్ ఎంపిపి డాక్టర్ వెంకటరమణ, మండల కో–ఆప్షన్ సభ్యుడు మహబూబ్ బాషా, ఐటిబిపిఎఫ్ ఇన్‌స్పెక్టర్ వై.వి.రెడ్డి, కృష్ణారెడ్డి, ధర్మారావు, వెంకటేష్, బాబూలాల్, సతీష్, మాజీ సైనికోద్యోగులు రవిచంద్ర, మదనమోహన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బీమా పత్రాలను అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి

బాధిత కుటుంబానికి బీమా మంజూరు

ప్రజాశక్తి-రామాపురం

మండలం నీలకంఠరావుపేటకు చెందిన పఠాన్‌గౌస్‌ఖాన్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపారు. వైఎస్ఆర్ బీమా క్రింద రూ.5 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. మంజూరు ఉత్తర్వులను శనివారం బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే మోహన్ రెడ్డి అందించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంభ సభ్యులు మాట్లాడుతూ కుటుంభ యజమాని ఆకస్మికంగా మృతి చెందడంతో అనాథగా తమకు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు అండగా నిలిచి బీమా మంజూరు చేయించారని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, మాజీ ఎంపిపి ప్రభాకర్ రెడ్డి, వైస్ఎంపిపి బాబు, ఇంతియాజ్, ఎంపిడిఒ హైదర్‌వలీ, సర్పంచ్ ఆయూబ్, ఉప సర్పంచ్ రఫీ, వైసిపి జిల్లా కార్యదర్శి జాకీర్, సహదేవ రెడ్డి, రామగోపాల్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, రాజు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న అమీరుద్దీన్

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

ప్రజాశక్తి-రామాపురం

మండల కేంద్రాలు, మున్సిపాలిటీ ఏరియా పరిధిలోని గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి కడప జిల్లా గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి అమీరుద్దీన్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన రామాపురంలోని శాఖ గ్రంథాలయంలో వార్షిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయానికి వచ్చిన విద్యార్థులతో పలు విషయాలు చర్చించారు. ప్రతిరోజు గ్రంథాలయానికి రావడం అలవాటు చేసుకోవాలని దీనివల్ల విద్యార్థుల్లో మేధోశక్తి పెరగడమే కాకుండా మనసుకు ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. గ్రంథాలయానికి సంబంధించిన వివిధ రికార్డులను పరిశీలించారు. అనంతరం సభ్యత్వ నమోదు మరింత చేపట్టాలని గ్రంథాలయాధికారికి సూచించారు. లక్కిరెడ్డిపల్లె శాఖ గ్రంథాలయాన్ని పరిశీలించి వార్షిక నివేదికను పరిశీలించారు. అనంతరం లక్కిరెడ్డిపల్లె శాఖగ్రంథాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో రామాపురం శాఖ గ్రంథాలయ అధికారి సూర్యనారాయణరెడ్డి. విద్యార్థులు పాల్గొన్నారు.

మురళీతో మాట్లాడుతున్న నాయకులు

విభిన్న ప్రతిభావంతుడిని ఆదుకోండి

ప్రజాశక్తి-పుల్లంపేట

పెనగలూరు మండలం ఇండ్లూరు గ్రామానికి చెందిన విభిన్న ప్రతిభావంతుడు మురళీఆచారి అంధత్వం, వినికిడి లోపంతో బాధపడుతున్నారని వారిసొంత గృహ నిర్మాణానికి సాయం అందించాలని విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షులు మల్లు సుబ్బనరసారెడ్డి పేర్కొన్నారు. స్థానిక అధ్యక్షుడు తిరుపాలు ఆధ్వర్యంలో మురళి ఆచారి ఇంటి నిర్మాణాన్ని పరిశీలించారు. సొంతిల్లు లేక వేరే వారి ఇంటిలో జీవనం సాగిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం ఇంటిని మంజూరు చేసిందని ప్రభుత్వం అందించే మొత్తం నిర్మాణానికి సరిపోదని దాతలు స్పందించి మురళీకి సాయం చేయాలని కోరారు. నియోజకవర్గ స్థాయి లోని అన్ని మండలాల విభిన్నప్రతిభావంతుల నాయకులతో కలసి మా వంతు సహాయ సహకారాలు అందిస్తా మని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐ నాగేంద్ర

ప్రమాదాల నివారణకు సహకరించండి

ప్రజాశక్తి-కలకడ

మండలంలో జరుగుతున్న ప్రమాదాల నివారణకు తమ వంతు సహకారం అందించాలని కలకడ సిఐ నాగేంద్ర పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన కలకడ పోలీస్ స్టేషన్ లో టమోటా మార్కెట్ యజమానుల, ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రత్యేకంగా ఉన్న ప్రాంతాలైన టమోటా మార్కెట్ ,కళాశాలలో పాఠశాలల వద్ద భారీ కేడ్లు ఏర్పాటు చేయడానికి తమ వంతు సహకారం అందించే దోహదపడాలని కోరారు. టమోటా మార్కెట్ యార్డ్ వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనముల రద్దీ ఎక్కువగా ఉండటం వల్ల తరచూ ప్రమాదాలు జరిగేం దుకు అవకాశాలు మెండుగా ఉన్నాయని ఇందుకోసం రోడ్డు భద్రత నియ మాలను పాటించేందుకుగాను భారీ చెట్లు ఏర్పాటు చేసేందుకు ఆర్థికంగా సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ తిప్పేస్వామి, టమోటా మార్కెట్ దుకాణాల, యజమానులు, పాఠశాలల యజమానులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ బస్సులను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కడప-తిరుపతి మధ్య తిరిగే ఎలక్ట్రికల్ బస్సుల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ రాష్ట్ర డిఆర్‌డిఎ అధికారి యల్లటూరు శ్రీనివాసరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఈ ఎలక్ట్రికల్ బస్సుకు రాజంపేట నందు స్టాపింగ్ లేదని,ఆర్‌టిసి చైర్మన్ మల్లికార్జునరెడ్డి దృష్టికి తీసుకుపోగా వెంటనే స్పందించి స్టాపింగ్‌కు అనుమతి నిచ్చారని తెలిపారు.

మహారాజశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టు, కదిరి
O.S. No: 260/2018

Between:-
1. కొట్టే సుబ్బమ్మ W/o. రామప్ప డోర్ నెంబరు 5-198, బలిజపేట, తలుపుల విలేజ్ & మండలం, శ్రీసత్యసాయి జిల్లా. ..వాది

And

కదిరి అనిత మరియు ఇతరులు ...ప్రతివాదులు

2వ మరియు 3వ ప్రతివాదులకు దావా నోటీసులు

To,
D2. కె.రామచంద్ర S/o ఆదినారాయణ, కందుకూరు (విలేజ్) మొలకల చెరువు (మండలం) అన్నమయ్య జిల్లా.
D3. కె. హేమంత్ S/o. రామచంద్ర, కందుకూరు (విలేజ్) మొలకల చెరువు (మండలం) అన్నమయ్య (జిల్లా)

అను మీ పైన వాది అయినటువంటి సుబ్బమ్మ ఆస్తుల భాగపరిష్కార నిమిత్తం దావా దాఖలు చేసియున్నారు. సదరు దావా పైవారి కోర్టునందు మీ హాజరు నిమిత్తం 13-10-2023వ తేదీన వాయిదా ఉన్నది. సదరు వాయిదా తేదీన ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా కాని వకీలు ద్వారా గాని పై వారి కోర్టునందు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనచ్చును. అట్లు హాజరు కాని యెడల మీ పరోక్షంలో తీర్మానం చేయబడునని తెలియజేయడమైనది.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది: 13-10-2023
ఇట్లు: వి.ప్రసాద్ రెడ్డి, B.A., BL.
అడ్వకేట్, వాదిపరం వకీలు, కదిరి.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సిడిపిఒ పద్మావతి తెలిపారు. బాల్య వివాహాలపై గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ గిరీష ఆదేశించారని చెప్పారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బాల్య వివాహాలపై అవగాహన కోసం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. బాల్య వివాహాలు చేస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1098కు ఫోన్ చేయాలని, అలాగే మహిళా రక్షణ కోసం 112 నెంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. 18 సంవత్సరాలు లోపల ఉన్న బాలికలకు 21 సంవ త్సరం లోపల ఉన్న బాలురకు వివాహాలు చేస్తే చట్టపరంగా చర్యలు ఉంటా యని పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు ఎంపిడిఒ రమణారెడ్డి, తహశీల్దార్ ఉదయ్ శంకర్ రాజు, ఎంఇఒ చక్రేనాయక్ పాల్గొన్నారు

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సిడిపిఒ, తహశీల్దార్

గర్భిణులు సమతుల్య ఆహారం తీసుకోవాలి

చిట్వేలి : అవగాహన ర్యాలీ చేస్తున్న అంగనవ్వాడీ సిబ్బంది

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పోషణ మాసోత్సవాలను పురస్కరించుకొని బి.కొత్తకోట ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మండలంలోని తుమ్మనంగుట్ట పంచాయతీ, మాదిగపల్లె అంగన్వాడీ కేంద్రంలో శనివారం పోషకాహారాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిఎంకెఎస్ ఎ.కరిష్మా, సిహెచ్ఒ గీతాంజలి మాట్లాడుతూ న్యూట్రిషన్, మినరల్స్, కాల్షియం, ఐరన్ కలిగిన చిరుధాన్యాలు, ఆకుకూరలు, గోంగూర, దంటాకు, మునగాకు కాయగూరలు, ధాన్యాలు, పండ్లు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు అందేలా తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా నెలకు మూడు కేజీల బియ్యం, ఒక కేజీ కందిపప్పు, అర లీటర్ వంటనూనె, 25 కోడిగుడ్లు, ఐదు లీటర్ల పాలు, వైఎస్ఆర్ పోషణ కిట్‌లో రెండు కేజీల రాగిపిండి, ఒక కేజీ అటుకులు, 250 గ్రాములు బెల్లం, ఖర్జూరం, చిక్కీలు లబ్ధిదారులు ఆహారంగా తీసుకోవాల న్నారు. ప్రతిరోజూ ఐరన్, కాల్షియం మాత్రలు ప్రతిరోజు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఎన్ఎం పి.హసీనా, అంగన్వాడీ కార్యకర్తలు టి.అమరావతి, సి.శివమ్మ, జి.మాధవి, ఎస్.మస్తానీ, ఆర్.శివగంగ ఆశాలు కె.నరసమ్మ, కె.మధుకల్పన గర్భిణులు, బాలింతలు హాజరయ్యారు. **రైల్వేకోడూరు :** గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని ఐసిడిఎస్ సిడిపిఒ టి పి.సౌభాగ్యమ్మ అన్నారు. పోషణ మాసోత్సవాలలో భాగంగా కోడూరు సెక్టార్ లోని ఉంగరాలనగరం అంగన్వాడీ కేంద్రంలో పోషకాహారం మాసోత్సవాలు, గర్భిణులు, బాలింతలకి పౌష్టిక ఆహారం గురించి తల్లులకి చిరుధాన్యాల ప్రాముఖ్యతను గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సిడిపిఒ సౌభాగ్యమ్మ, ఎసిడిపిఒ సరళాదేవి, సూపర్వైజర్ గుణవతి, అంగన్వాడీ టీచర్స్ మండలంలోని అందరు టీచర్స్ పాల్గొన్నారు. పోషణ మాసోత్సవాలు రైల్వే కోడూరు ప్రాజెక్ట్ పరిధిలోని మూడు మండలాల పరిధిలో నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** ఆకుకూరలు తింటే ఆరోగ్యకరంగా ఉంటారని లక్కిరెడ్డిపల్లి సిడిపిఒ పద్మావతి తెలిపారు. పోషకాహార మాసోత్సవాలలో భాగంగా శనివారం లక్కిరెడ్డిపల్లి ఐసిడిఎస్ కార్యాలయం నుండి మూడు రోడ్ల కూడలి వరకు సైకిల్‌ర్యాలీ నిర్వహించి మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ గ్రామ క్లస్టర్ మండల స్థాయిలో పోషకాహార మహోత్సవాలు విజయవంత చేయాలని ఆమె తెలిపారు. గర్భవతులకు గర్భం దాల్చినప్పటి నుంచి ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ప్రసవం తర్వాత తల్లీ బిడ్డ క్షేమంగా ఉంటారని తెలిపారు. ప్రతి ఇంటి ప్రాంగణంలో మునగ చెట్టు నాటుకోవాలన్నారు. మునగాకు పరిసర ప్రాంతాల్లో దొరుకుతుందని ఈ ఆకును ప్రతి ఒక్కరు ఉపయోగించాలన్నారు. పతికూర లోనూ కరివేపాకు ఆకులు తోనే కూర చేసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో ప్రభుత్వం అందిస్తున్న బాలామృతం, చిక్కీలు, గుడ్లు, పాలు, బాలింతలు, గర్భిణులకు అందించాలన్నారు. పిల్లలకు ఆకుకూరలు అన్నం పెట్టాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు అరుణ, హైమావతి, లత, లక్ష్మి, జిఎంఎస్ ప్రశాంతి అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు. **పుల్లంపేట :** గర్భిణులు, బాలింత మహిళలు సమతుల్య పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యమునకు చాలా మంచిదని అంగన్వాడీ సూపర్వైజర్ వై నిర్మలాదేవి పేర్కొన్నారు. పుల్లంపేట సచివాలయ పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార మహోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ నారాయణ ,ఎఎన్ఎం, ఆరోగ్య సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. **చిట్వేలి :** సమతుల్య వైవిధ్య భరితమైన సంపూర్ణ పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమౌ తుందని ఐసిడిఎస్ చిట్వేలి సిడిపిఒ రాజేశ్వరి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏబిఎన్. ప్రసాద్, ఉపాధ్యాయులు శ్రీనివాస్ ఐసిడిఎస్ గ్రేడ్-1సూపర్వైజర్ సురేఖరాణి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జిపిఎస్‌కు వ్యతిరేకంగా నిరసన చేస్తున్న ఉపాధ్యాయులు

జిపిఎస్‌ను అంగీకరించం

ప్రజాశక్తి-కలికిరి

జిపిఎస్ విధానం ఆమోదయోగ్యం కాదని ఒపిఎస్ మాత్రమే అంగీకరిస్తామని జిల్లా ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్‌యాదవ్ అన్నారు. ప్రభుత్వం ఒపిఎస్ రద్దుచేసి జిపిఎస్‌ను ప్రవేశపెట్టడానికి అసెంబ్లీలో ఆమోదం తెలపడంతో ఉద్యోగ సంఘాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా కుమార్‌యాదవ్ మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించే ఒపిఎస్ విధానం తప్ప మరే విధానాన్ని ఉపాధ్యాయులు ఆమోదించరని తెలిపారు. వారం రోజుల్లో సిపి ఎస్ రద్దుచేసి ఒపిఎస్ అమలు చేస్తామని ఎన్నికల వేళ పదేపదే ఇచ్చిన హామీని అధికారంలోకొచ్చాక తప్పక నెరవేరు స్తార ని ఆశించిన ఉద్యోగుల నమ్మకాన్ని వమ్ము చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హామీ విస్మరించి ఉద్యోగ ఉపాధ్యాయులు కు నష్టం కలిగించే జిపిఎస్ విధానాన్ని బలవంతంగా అమలు చేస్తున్నారని అన్నారు. ఇటీవల ఐదారు రాష్ట్రాలు పాత పెన్షన్ విధానాన్ని అమలుచేసే దిశగా కార్యచరణ చేస్తుంటే, బలంగా హామీ ఇచ్చిన మన ప్రభుత్వం మాత్రం మాటతప్పడం సమం జసం కాదన్నారు. జిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు నీలకంఠ, అజంతుల్లా, మహేష్, శ్రీనివాసులు, ప్రతాప్, గురుప్రసాద్, రాజేంద్రప్రసాద్, జయరామిరెడ్డి పాల్గొన్నారు.

విగ్రహప్రతిష్టాపనలో ఎంపిపి శ్రీదేవిరవికుమార్

శ్రీచౌడేశ్వరిదేవి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-కలకడ

శ్రీచౌడేశ్వరి దేవి విగ్రహ ప్రతిష్టను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు చింతల రామచంద్రారెడ్డి సోదరుడు శివానందరెడ్డి, ఎంపిపి శ్రీదేవిరవికుమార్‌ల ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్టను ఘనంగా నిర్వహించారు. నూతనంగా ఆలయం నిర్మించి శ్రీ చౌడేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్టను మేళతాళాలు వేద పండితుల మధ్య వైభవంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం తీర్థప్రసాదాలు పంచిపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కోన సర్పంచ్ రాజగోపాల్‌రెడ్డి, మండల కన్వీనర్ మోహన్ రాజా , ప్రత్యేక ఆహ్వానితులు కిషోర్, చలమయ్య, వైసిపి పాల్గొన్నారు.

పరవళ్లు తొక్కుతున్న పుల్లంగేరు

ప్రజాశక్తి-పుల్లంపేట

పుల్లంగేరులో ప్రవహిస్తున్న వర్షపు నీరు

మండల పరిధిలోని బోటు మీదపల్లి వద్ద శనివారం తెల్లవారు జామున పుల్లంగేరు ఇటీవల కురిసిన వర్షాల వల్ల పరవళ్ళు తొక్కుతుంది. నిన్న మొన్నటి వరకు నిర్మానుష్యంగా ఉన్న పుల్లంగేరు నీటి ప్రవాహంతో ఉప్పొంగుతుంది. నీటి ప్రవాహం చూసి చుట్టుపక్కల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసి చూడడానికి ఎగబడుతున్నారు. నీటి ప్రవాహంతో 20 గ్రామాల రైతులు ఆనందంలో వ్యక్తం చేశారు.పంటల సాగుకు కొంత మేర నీటి కష్టాలు తీరుతాయని చెప్పారు.

ఆర్థిక సాయం అందిస్తున్న సాయివికాస్‌రెడ్డి

వ్యాధిగ్రస్తునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఓబులవారిపల్లి

మంగంపేట పంచాయతీ అగ్రహారం గ్రామానికి చెందిన కోటకొండసాయి కుమారుడు చాణిక్య అనీమియా వ్యాధితో బాధపడుతున్నాడు. రక్తహీనత సమస్య చికిత్స నిమిత్తం కోసం వారి కుటుంబానికి ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ తరుపున ముక్కా సాయివికాస్‌రెడ్డి రూ.30వేల ఆర్థిక సాయం అందించారు. అంతే కాకుండా వారి కుటుంబానికి ఎటువంటి ఇబ్బంది వచ్చినా అండగా ఉంటా మన్న హామీనిచ్చారు. కార్యక్రమంలో వెంకటేష్, నాగరాజు, నాగేంద్ర పాల్గొన్నారు.

ఆన్‌లైన్ లావాదేవీలపై అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ సురేంద్రనాథ్

పారదర్శకత కోసమే నగదు రహిత లావాదేవీలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

గ్రామపంచాయతీలలో పారదర్శకత కోసమే నగదు రహిత లావాదేవీలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ సురేంద్రనాథ్ తెలిపారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు ఆన్‌లైన్ పేమెంట్‌లపై ఒకరోజు శిక్షణ ఇచ్చారు. మాస్టర్ ట్రైనర్స్ రఘునాథ్, మల్లికార్జునలు ఆన్‌లైన్ చెల్లింపులపై వివరించారు. పంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్ను వసూలు, వీధిదీపాలు, తాగునీటిబోర్లు, జియో ట్యాగింగ్ చేసి ప్రతి సమాచారాన్ని యాప్‌లో పొందుపరచాలన్నారు. లబ్ధిదారులు పలురకాల ధ్రువీకరణ పత్రాలు, భూముల మిటేషన్, విద్యుత్ చార్జీల చెల్లింపులు తదితరాలను ఆన్లైన్ పేమెంట్ ద్వారా చెల్లించే తీరుపై అవగాహన కల్పించారు.

ఎంఆర్‌సి సిబ్బందికి అందని వేతనాలు

కొత్తకోట : మండలంలో ఎంఆర్‌సి సిబ్బంది వేతనాలు వెతలు చెందుతున్నారు. ఈ సందర్భంగా బి.కొత్తకోటలోని సిబ్బంది మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా తాము ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నామన్నారు. తమకు ప్రతి నెలా వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. విద్యా వ్యవస్థల సమూల మార్పు లకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించుకోవడం బాధాకరమన్నారు. గత మూడు నెలలుగా జీతాలు అందకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేతనాలు అందేవిధంగా చొరవ చూపాలని కోరారు.

ముంబయి సదస్సుకు మునిగోపాలకృష్ణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఈ నెల 25వ తేదీన ముంబయిలో జరిగే సీనియర్ సిటిజన్స్ అల్ ఇండియా కాన్ఫడరేషన్ సమావేశానికి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోషియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు ఎన్.మునిగోపాలకృష్ణ శనివారం వెళ్లారు. అఖిల భారత సీనియర్ సిటిజన్స్ 21వ జాతీయ సదస్సు పూణేలో అక్టోబర్ 1న ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవము గురించి చర్చిస్తారని చెప్పారు. అక్టోబర్ 10, 11న జాతీయ సదస్సు విషయాలపై చర్చ ఉంటుందన్నారు.యోవృద్ధుల సమస్యల సాధనకు యుఎస్ఒ సంపూర్ణంగా సహకరిస్తున్నారని చెప్పారు. దేశంలో 17 కోట్ల మంది సీనియర్ సిటిజన్స్ వేధింపుల నివారణకు, ఆరోగ్య విషయములో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని కోరారు.

క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

క్రీడా పోటీలలో విజ్‌డమ్ విద్యార్థుల విజయభేరి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండల స్థాయి క్రీడా పోటీలలో విజ్‌డమ్ విద్యా సంస్థల విద్యార్థులు విజయభేరి సాధించారని కరస్పాండెంట్ డాక్టర్ టి.ప్రదీప్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయి అండర్-17, అండర్-14 బాలురు బాలికల విభాగాలలో ఖోఖో క్రీడల్లో మండల ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారని, తెలిపారు. అండర్-17 బాలికల షాట్‌పుట్ విభాగంలో గౌరీ రెండవ స్థానం, అండర్-14 బాలికల 200 మీటర్స్ పరుగు పందెంలో హిమశ్రీ రెండవ స్థానం అండర్-14 బాలుర విభాగంలో డిస్కస్‌త్రో విభాగంలో సుమన్ రెండవ స్థానం సాధించినట్లు తెలిపారు. నియోజ కవర్గస్థాయి అండర్-17 బాలుర విభాగంలో దీక్షత్, మదన్ ఎంపికైనట్లు తెలిపారు. అండర్-14 బాలుర విభాగంలో మహీదర్, ఉమర్‌లు నియోజకవర్గ కబడ్డీ జట్టుకు ఎంపికైనట్లు ప్రదీప్ తెలిపారు. క్రీడలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కరెస్పాండెంట్‌తో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు అకాడమిక్ డైరెక్టర్ టి.మదన్మోహన్, ప్రిన్సిపల్ టి.ప్రియాంక అభినందించారు.

'ఆయుష్మాన్ భవ'తో అందరికీ వైద్యం

ప్రజాశక్తి-కలికిరి



ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్న డాక్టర్ పవన్‌కుమార్

ఆయుష్మాన్ భవతో అందరికీ వైద్య సేవలు అందుతాయని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ వై.పవన్‌కుమార్ తెలిపారు. కలికిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆయుష్మాన్ భవ మేళా వారోత్సవాల సందర్భంగా ఆరోగ్య శిబిరం, అవయువదాన ప్రతిజ్ఞ, రక్తదాన శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరణించిన తరువాత అవయవదాన ప్రాముఖ్యతను తెలియచేసి 20 మంది దగ్గర అవయువ దాన పోర్టల్‌లో నమోదు చేసి ధ్రువీకరణ పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఆయుర్వేద డా.విజయచంద్రిక, శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ సిమ్రాన్, డాక్టర్ ఉదయకరణ్, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ అన్వేష్ , డాక్టర్ నవీన్ కుమార్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

జూనియర్ కళాశాల విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఉన్నత ఆశయంతో చదవాలని మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షుడు స్థానిక న్యాయమూర్తి ఉమర్ ఫరూక్ తెలిపారు. శనివారం జూనియర్ ప్రభుత్వ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. విద్యార్థులకు చట్టాల గురించి వివరించారు. కళాశాలలో ర్యాగింగ్ కు పాల్పడరాదని ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు ఉన్నతాశయంతో చదివి, ఉన్నత స్థాయికి ఎదిగి కళాశాలకు స్వగ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-గాలివీడు

శ్రీ సాయి నర్సింగ్ హోమ్ కంటి వైద్య నిపుణులు మాధవి ఆధ్వర్యంలో శనివారం గాలివీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు నిర్వహించిన ఉచిత మెగా కైత విద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు స్థానిక ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ రఫిక్ పేర్కొన్నారు. 48 మంది వైద్య శిబిరానికి హాజరయ్యారని అందులో 18 మంది కంటి శస్త్ర చకిత్స అవసరమని చెప్పారు. కడప జిల్లా కేంద్రానికి ఉచితంగా తీసుకువెళ్లి శస్త్ర చికిత్స చేయించి తీసుకొచ్చే బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని తెలిపారు. వైద్యుల సూచనల మేరకు కంటి అద్దాలు, మందులను ఉచింత అందివ్వనున్నట్లు పేర్కొన్నారు.

నిమజ్జనంలో పాల్గొన్న ఎంపిపి శ్రీదేవి రవికుమార్

వైభవంగా గణేష్ నిమజ్జనం

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని బాటవారిపల్లెలో ఎంపిపి శ్రీదేవిరవికుమార్ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్టను ఘనంగా నిర్వహించారు.మొదట విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి బళ్లారి డప్పులు మేళ తాళాలు యువకుల నాట్యాల మధ్యలో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని కోటగుడిబండ పంచాయతీ ఎల్లం గుడిబండలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. **మదనపల్లె అర్బన్ :** పట్టణంలోని నీరుగట్టువారిపల్లి, సాయి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం నందు ఏర్పాటు చేసిన శివపార్వతి సమేత గణేశుడి నిమజ్జనంఅత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఏడాది వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పాఠశాల ఆవరణంలో వినాయకుడి ప్రతిమను నిలుపుకోవడం ఆనవాయితీ చేస్తున్నామన్నారు.

వీర జవాన్ భార్యకు ఉద్యోగం

ప్రజాశక్తి-తంళ్లపల్లె

జవాన్ సాయితేజ భార్య బి.శ్యామల

దేశభద్రతాధికారి మేజర్ దితిన్‌రావత్, లాన్స్‌నాయక్ సాయితేజలు హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందారు. ప్రభుత్వం సాయితేజ భార్య బి.శ్యామలకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించారు. ఉద్యోగం రావడానికి రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డిల కృషి ఫలితంగా ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించారని కృతజ్ఞతలు తెలిపారు. శ్యామల శుక్రవారం స్థానిక వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు.

జర్నలిస్టులకు ఇంటి స్థలాలు : ఎమ్మెల్యే

మదనపల్లె అర్బన్ : మదనపల్లెలో జర్నలిస్టులకు చిరకాల స్వప్నం ఇంటి స్థలాలు అందించడానికి ఎమ్మెల్యే నవాజ్‌బాషా స్పష్టమైన హామీనిచ్చారు. శనివారం మదనపల్లి ప్రెస్ క్లబ్‌లో అధ్యక్షులు రమేష్ ఆధ్వర్యంలో తోలుత సమావేశం నిర్వహించారు. అనంతరం అక్కడ నుం ఎమ్మెల్యే నవాజ్‌బాషా కార్యాలయానికి వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ దశాబ్దాలుగా పనిచేస్తున్న జర్నలిస్టులు ఉన్నారని ఇప్పటికీ వారికి ఇంటి పట్టాలు, పక్క గృహాలు అందలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుక వెళ్ళామన్నారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ పాత్రికేయుల సంక్షేమానికి, సమస్యలను పరిష్కరించేందుకు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డితో పాటు తాను సంసిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే అర్హులైన విలేకర్లకు ఇంటి స్థలాలు కేటాయిస్తూ, పట్టాలు పంపిణీ చేస్తామని హామీనిచ్చారని చెప్పారు.ఎమ్మెల్యే హామీ పట్ల జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు.